# సరదా కథలు

## పాత భేతాళుడు-కొత్త కథ

పాత కథా ప్రకారం — యథాప్రకారం— భేతాళుడి శవాన్ని భుజాన్వేసుకుని నడక సాగించాడు విక్రమార్కుడు. మాట్లాడ్డం ప్రారంభించాడు భేతాళుడు.

"రాజా!"

"ఓయ్" అన్నాడు విక్రమార్కుడు.

గభుక్కుని చెట్టెక్కాలో లేక మానాలో అన్న విషయం ఓక్షణంపాటు అర్థంకాలేదు భేతాళుడికి.

"అదేమిటి... అప్పుడే మాట్లాడేసావు?" అని అడిగాడు సందేహనివృత్తి కోసం.

"కొత్త రూల్సు ప్రకారం నేను మధ్యలో ఎంత మాట్లాడినా నీకు చెట్టెక్కిపోయే పనరు లేదు. కాకపోతే నువ్వు పాత సైపు కథలు కాకుండా కొత్త సైపు కథలు చెప్పాలి. సైపంటే సైపు, షార్టుహేండు అనుకోనేవు, తరహా అని అర్థం చేసుకోవాలి. అలాంటి కొత్త తరహా కథలు నువ్వు చెప్పకపోతే నీతల వెయ్యిచెక్కలవుతుంది. అలాంటి కథలకి సరియైన ముగింపు నేనివ్వలేకపోతే నా తల వెయ్యి చెక్కలయిపోతుంది. అదీ ఎగ్రిమెంటు" అన్నాడు విక్రమార్కుడు.


"ఇది బానే వుంది. తల వెయ్యి చెక్కలవడంలో కూడా మార్పు చేసుకొంటే బావుంటుందేమో?" "అదెలా?"

"ఏవుందీ... తెలుగు టనీ కార్యక్రమాలు చూసే గతి నీకు పట్టుగాక" అని ఒకర్నొకరు శపించేసుకుంటే పోతుంది" అన్నాడు భేతాళుడు.

"కరక్టే... తల అలా ఒక్కసారిగా వెయ్యి చెక్కలవడం కంటే ఇలా భరించరాని నిత్య నూతన దుర్భర శిరోవేదనే పెద్ద శిక్ష. సరే... కానీ... మొదలెట్టు నీ కొత్త సైపు కథ" అన్నాడు విక్రమార్కుడు.

"అనగనగా ఓ అహల్య..."

"అదిగో మళ్ళీ... అహల్య... గౌతముడు... శ్రీరాముడు... రాయిని ఆడది చేసిన రాముడినా సైపు కథ..." అంటూ విసుక్కోబోయాడు విక్రమార్కుడు.




"అదిగో అలా విసుక్కోకూడదు. పైగా పాత కథల్లో నన్ను గురించి రాస్తూ 'విసుగు చెందని విక్రమార్కుడు' అని నన్ను వర్ణించారు. దాంతో ఈతరం వాళ్ళు విక్రమార్కుడి ఇంటి పేరు విసుగు చెందని అని అనుకుంటున్నారు కూడా... అంచేత విసుక్కోక కథ విను..." అన్నాడు భేతాళుడు.

"ఇంత సుత్తి వేస్తావని తెలిస్తే అసలు విసుక్కునే వాడినే కాదు. నాలో నేనే విసుక్కునే వాణ్ణి... సరే.. కానీ.. కథ"

ఆమాత్రం వ్యవధి చాలు భేతాళుడికి... అద్భుతమైన స్పీడ్‌తో కథ ఫ్రేమ్ వేసేసుకోగలడు.

"ఇది కాపీ కథ, అర్ధణాకథ కాదు రాజా మాటికి మారు పేళ్ళు మారు నయా పైసల తెలుగు కథ. తెలుగు భాషలోని చమత్కారాన్ని మారి కూరిన కథ... విను..."

ఆ అహల్యకు పెళ్ళయింది. భర్తపేరు గౌతమ్ అని నువ్వనుకున్నా నాకభ్యంతరము లేదు. పాతకథల ప్రభావం వల్ల అహల్యను అనునిత్యం అనుమానించసాగాడు గౌతముడు.

రాయిగా మారమని శపించే సవరు లేదు కాబట్టి కోపం వచ్చినప్పుడల్లా చేతికందింది ఆమెపై విసిరి కొట్టడం ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టాడు.

భరించలేని అహల్య ఓ రోజు ఓ డాక్టర్ దగ్గరికి వెళ్ళింది" అని ఆగాడు భేతాళుడు.

"ఆ డాక్టర్ పేరు శ్రీరామ్... అవునా!?" అన్నాడు విక్రమార్కుడు ఉత్సాహంగా.

"కాదు... ఆయన పేరు నిదానం..."

"అదేంటి... పేరలా ఉంది!?"

"అదేంతే... తెలుగు పత్రికల్లో మన కథ అచ్చవ్వడానికి ఇలాంటి పేరు ఓ స్పెషల్ క్వాలిఫికేషన్ ప్లస్ అదనపు ఆకర్షణ కూడా... ఇంతకీ కథ విను.

ఆ అహల్య తన గోడు విన్నవించుకుంది డాక్టర్ నిదానంతో.

"ఎలాగైనా సరే ఆయనకు నాపై గురి కుదిరేలా చేయండి డాక్టర్! చచ్చి మీ కడుపున పుడతాను" అని కన్నీళ్ళతో ప్రార్థించింది.

డాక్టర్ నిదానం హృదయం ద్రవించిపోయింది. వెంటనే తన మేధస్సు నంతా రంగరించి ఓ మందు తయారు చేసి అహల్యకు ఇచ్చాడు.

"ఈ మందు మీ ఆయనతో తాగించమ్మా నీ మీద ఖచ్చితంగా ఆయనకు గురికుదురుతుంది" అన్నాడు.

ఆ రాత్రే అహల్య ఆమందుని తన భర్త గౌతమ్‌తో తాగించింది. కానీ మర్నాడు ఉదయానికల్లా ఆమె చచ్చిపడుంది. ఇదెలా సాధ్యం? డాక్టర్ ఇచ్చిన మందు పనిచేయలేదా? ఏమిటి దీని వెనుక నున్న మిస్టరీ... తెలిసి సమాధానం కొత్త సైపులో చెప్పక పోయావో..."

"తెలుసు లేవోయ్ ... ఆ శిక్ష గుర్తు చేసి ఏకాగ్రత చెడగొట్టకు..."

"చెడగొట్టనులే... చెప్పు..."

"ఆ అహల్య... అడిగిందేమిటి... తన మీద

గురి కుదిరేలా చెయ్యమని... డాక్టర్ నిదానం మందిచ్చింది అందుకే... ఆ రోజు రాత్రి గౌతమ్ మందు తాగేక రొటీన్‌గా అహల్యను అనుమానించి ఉంటాడు. మందిచ్చాను కదా పని చేస్తుందిలే అనే నమ్మకంతో ఆమె మరింత ఎదిరించి మాట్లాడి ఉంటుంది.

ఎప్పుడూ అణిగిమణిగి ఉండే భార్య ఎదిరించే సరికి తిక్క రేగిపోయి ఉంటుంది గౌతమ్‌కి. ఆమె చంపెయ్యాలన్నంత కోపంతో చేతికందింది విసిరెయ్యడం ప్రారంభించి ఉంటాడు.

ఇది వరకు అతడు అలా విసుర్తూ ఉంటే అటూ ఇటూ పడిపోయి ఉండేవి. ఇప్పుడు డాక్టర్ నిదానం ఇచ్చిన మందుతో కరెక్ట్‌గా గురికుదిరి సరిగ్గా ఆమెకు తగిలి దెబ్బతో చని పోయి ఉంటుంది... అంతేనా?''

''అమ్మనీ...'' ఆశ్చర్యపోయాడు భేతాళుడు'...తీయని దెబ్బ..ఎంత కమ్మగాఉందరో యబ్బ..'' అని రాగ యుక్తంగా జత కలిపి ముగించాడు విక్రమార్కుడు.

''బాసూ... వన్ మినిట్...''

''నేను బాగా పాడేనని అభినందనలు చెప్తావా? ఓకే... ప్రొసీడ్...''

''నువ్వు బాగా పాడేనని ఎవరన్నారు రాజా!?''

''మ్మరి? ఇంతవరకు 'రాజా రాజా' అని ఇప్పుడు 'బాసూ' అనగానే 'బాలసుబ్రహ్మణ్యం' అని పిలవలేక, నోరు తిరక్క షార్ట్‌కట్‌లో 'బాసూ' అని పిల్చావనుకున్నా... సరే ఈ రసపిపాసిని ఎందుకు వన్ మినిట్ అంటూ ఆగమన్నావో చెప్తావా ఓ రసహీన పిశాచీ!?'' అడిగాడు విక్రమార్కుడు.

''నీ చమత్కారాలు నాలుగాని డాక్టర్ నిదానం అలాంటి మందు ఎందుకిచ్చాడో చెప్పు?''

''ఎందుకేమిటి...ఆయనకు పిల్లలు ఉండి ఉండరు. అహల్య చచ్చి మీ కడుపున పుడతాను అని అంది కదా... ఇంత మంచి అమ్మాయి తన కూతురయితే బావుణ్ణని ఆశపడి ఉంటాడు పాపం.''

''అరె... భలే కరక్ట్‌గా చెప్పేస్తున్నావే... ఇప్పుడు చెప్పు... ఇది... ఆఖరు ప్రశ్న...అసలు ప్రశ్న... ఇంత జరిగినా ఆ అహల్య డాక్టర్ నిదానం గారికి కూతురుగా జన్మించలేదు... ఎందుచేత?''

''పిచ్చి భేతాళా... ఈ ప్రశ్నకు సమాధానం ఆ డాక్టర్ గారి పేరులోనే ఉందోయ్!'' అన్నాడు విక్రమార్కుడు నిరగబడి నవ్వుతూ.

బిత్తరపోయిన భేతాళుడు 'టప్'మని మాయం అయిపోయి 'ఫట్'మని చెట్టెక్కేశాడు.

మయూరి వీక్లీ



## స్వప్న

నేను శాకాహారిని. బొంబాయిలో శాకాహారం గార్డెన్ కోర్ట్ రెస్టారెంట్‌లో చాలా బాగుంటుంది. శాకాహారంలో రకరకాల డిషెస్ చేస్తారు వీళ్ళు. అయితే తమాషా ఏమిటంటే చాలా మంది తారలకు వంటరాదు. నేను మాత్రం బ్రహ్మాండంగా చేస్తాను వంట. అందువల్ల బొంబాయిలోని రెస్టారెంట్స్ అన్నిటికన్నా మా యింట్లోనే బాగుంటుంది భోజనం.

## శాంతిప్రియ



నేను దక్షిణాది అమ్మాయినని మీ అందరికీ తెలుసు. 'సార్క్ షిరటన్స్ దక్షిణ్' రెస్టారెంట్‌కి వెళతాను. ఈ రెస్టారెంట్ ప్రత్యేకత ఏమిటంటే కేరళ, కర్ణాటక, ఆంధ్ర, నార్త్ ఇండియా— ఇన్ని రుచులూ కలసిన భోజనం దొరుకుతుంది. క్కడ. ఈ రెస్టారెంట్‌లో ఒక వ్యక్తి 'ఫ్లూట్' అద్భుతంగా వాయిస్తాడు. అతను గుడ్డివాడు. కర్ణాటక సంగీతం వింటూ భోజనం తింటూవుంటే చాలా ఆనందంగా వుంటుంది.

